# చిత్రవధ

★

శ్రీ బ్రహ్మాండం నరసింహం

★

'మన సాంఘిక పరిస్థితుల'ను గురించి అయిన ఆనాటి ఉపన్యాసం విని ఇంటికివస్తున్నాం. హాలు లోంచి పైకి వచ్చేటప్పటికే చల్లని వానగాలి వీచసాగింది. రోడ్డుమీది దుమ్మంతా సుడులుతిరిగి మమ్మల్ని ధూళిస్నానం చేయించింది. వర్షం వస్తుందేమోనని నడకవడి హెచ్చించాం. కాని ఒక ఫర్లాంగు నడిచేటప్పటికి వానచినుకులు టపటపమని పడటం ప్రారంభించినై. దగ్గరగాఉన్న ఒక ఇంట్లోకి త్వరగా చేరుకుని, వాన తగ్గుతుందా అని కాచుకున్నాం.

ఇంతలోకే మా ఎదురుగా ఒక జట్కా పోతున్నది. నేను వెంటనే 'ఓయ్, జట్కా, ఎంతక్కడ తావు కాలేజీ హాస్టలుకి?' అన్నాను. అదోపరధ్యానంగా 'ఎంతిస్తారు? ఆరణాలు' అన్నాడు. నేను ఎక్కుదామని సిద్ధపడ్డాను. ఇంతలోకే ఆచారి 'పావలాకి కట్టవ్?' అని బేరమాడేడు. బండివాడు 'ఎక్కండి - బేడకైనా కడతాను' అని గొణుక్కున్నాడు. మేమంతా ఎక్కి కూర్చున్నాం.

చీకటి బాగా ఆవరించింది, విద్యుద్దీపాల వెల్తురును నిరోధించడానికి వర్షం మరీ దట్టంగా కురుస్తున్నది. బండిలోకి ముందునుంచి జల్లుకొట్టకుండా కట్టిన మైనపుగుడ్డలోంచి, బండి నడపడానికి అవతలకు జాపిన బండివాని తల తడిసి ముద్దయింది. అతడి తలకీ మైనపుగుడ్డకి మధ్యఉన్న సందులోంచి జల్లుకొట్టు తున్నది మాకు. చలిగాలి బోరున వీస్తున్నది. చేతిగుడ్డలు చెవులకు కట్టుకుని కూర్చున్నాం.

ఆచారి బండివాణ్ణి అన్నాడు 'మామీదికి జల్లు కొట్టుతున్నది, మైనపుగుడ్డ సరిగా కప్పు' అని. నాకు చాలా జాలివేసింది 'అంత నిర్దయా?' అని జాలిగా అన్నాను. బండివాడు 'ఈయన దయగానే ఉన్నాడు బాబూ, గాలి తనకు తగిలింది కనుక తగిలిందన్నాడు' అంటూ మైనపుగుడ్డ పూర్తిగా కప్పేసి తాను వర్షంలో కూర్చున్నాడు. తరువాత నేనెన్నోమాట్లు లోపల కూర్చోమన్నా కూర్చోలేదు.

ఇంతలోకే హాస్టలు చేరుకున్నాము. వర్షం చాలా జోరుగావున్నందున బండివానికి మా హాస్టలు లోనే భోజనంపెట్టించి నా గదికి తీసుకుపోయాను.

నేను దుస్తులు మార్చుకుంటూ ఉన్నంతసేపూ అతను గది అంతా కలయచూస్తున్నాడు. అతని ముఖం ఎంతచూసినా నాకేభావం స్ఫురించలేదు. ఖాళీగా ఉంది అతని మొహం. 'నువ్వు అంత నిర్లక్ష్యంగా ఎందుకు తడిశావు?' అన్నా స్వెట్టరు తొడుక్కుంటూ.

నా ప్రశ్న వినిపించుకోనట్టు 'ఈ సంఘంలో దయ అనేది వుండాలంటారుకాదు మీరు?' అన్నాడు. అతని యాసచూస్తే అతను మామూలు జట్కావాడుకాడని తోచింది. ఆ విశాలమైన నుదురు, ఎత్తైన ముక్కు, చురుకుతనం కోల్పోయిన కళ గలమొహం—అన్నీ ఇతను సామాన్యుడుకాడనిపించినై. అతని పడుచుముఖంలో ఉన్న ముసలిరేఖలు, అతని అకాలంలో నెరసిన జుట్టూ అతని మనోబాధను తెలియ జేస్తున్నాయి.

'నేను వాల్తేరు పిచ్చి ఆస్పత్రినుంచి విడుదలచెయ్యబడ్డప్పటినుంచీ...' అతను కథ చెప్పబోతున్నాడని ఊరోచ్చమని సంజ్ఞచేశాను. కుర్చీలో నిదానంగా కూర్చుంటూ 'మీపాటి నన్ను ఆదరించినవాళ్లు ఎవ్వరూ లేరు. ఒకరిద్దరు 'ఏమి అలా పరధ్యానంగా ఉంటావు?' అని అడిగినవాళ్లున్నారు. కాని నేను నాకథ ప్రారంభించగానే వారు నన్నుచూసి నవ్వి 'మరీ అంత దేశకాలపాత్రతలు తెలియకుండా ప్రవర్తిస్తే!' అని వెక్కిరించారు. ఈ సంఘంలో దయ, సహనం ఏవీ? నన్ను సంఘం కావించిన చిత్రవధకు నేను కుమిలి చస్తూఉంటే, నా హృదయబాధకు బహిర్గమనంలేక నేను కొట్టుకుంటూఉంటే, నేను చెప్పేకథకు ఊకొట్టే ఓపికలేదే లోకానికి!' అని ఊపిరితీసుకుందుకు ఆగాడు. అతని పెదవులు వొణుకుతున్నాయి. కాని మొహం శాంతంగా ఉంది. అతన్ని ఎలా ఓదార్చాలో తెలియలేదు. అందుచేత మౌనంగా కూర్చున్నాను. అతను కథ ప్రారంభించాడు——

"...ఇప్పటికి పదేళ్లక్రిందట ఒకనాటి సాయంకాలం నా భార్యకు జబ్బుచేసింది. సుస్తీగాఉందని పడుకుంది. అసలు దాని ఒళ్లు ఆరోగ్యంగా ఉండేదికాదని తెలిసినా, ఇదివరకు అనేకసార్లు జబ్బురావటం తెలిసివున్నా, అప్పుడు ఇంతేచేసి, పెద్దజ్వరం రాకపోయినా, ఆనాడు సాయంత్రం నా హృదయంలో గుబులు బయలుదేరింది. ఎందుకో, ఆమెతల ఒళ్లోపెట్టుకుని ముంగురులు సవరిస్తూ ఈ జన్మకు ఆఖరుసారి సెలవుతీసుకుంటున్నానేమో అన్నట్టు తెగిపోతూన్న గొంతుకతో ఏడ్చేశాను. నా పదేళ్ల కూతురు పద్మ పక్కనే ఉంది. బావురుమని ఏడ్చింది.

తరువాత, నా జీవితప్రపంచ సూర్యుడస్తమించిన నిశిలో నాకో చంద్రవంక లభించింది. నా పద్మనుచూసి నా భార్యకోసం దుఃఖించడం తగ్గించుకున్నాను. పద్మకోసమే ప్రపంచంలో జీవించడానికి నిశ్చయించుకున్నాను. నా ప్రేయసి హృదయపూర్వకంగా నాకివ్వగలిగిన అత్యంతఘనమైన ప్రేమచిహ్నాన్ని నాకు ప్రసాదించింది. దాన్ని కాపాడుకుందుకు నేను నా శాయశక్తులా పాటుపడ్డాను.

నా చిన్నారికి క్రమంగా పన్నెండవఏడు వచ్చింది. మూడుమూర్తులా తల్లిని పోలియుండేది. ఎంతో చురుకుగా ఉండేది. ఇంతలోకి పెళ్లిమాట జ్ఞాపకంవచ్చింది. నాగుండెలో రాయిపడింది. పెళ్లి చెయ్యకుండా ఎట్లా ఉండను? పైగా అప్పట్లో సంఘాన్ని సంస్కరించే బుద్ధీలేదు - శక్తీలేదు.

ఇల్లరికం ఉండే అల్లుడికోసం చుట్టుపక్కలనున్న ఊళ్లన్నీ వెతికాను. అదృష్టవశాత్తు ఒక కుటుంబంలో వాళ్లకి ఎనిమిదిమంది పిల్లలుంటే, అందులో ఒకణ్ణి తెచ్చాను. అతనికి పదహారేళ్లు ఉంటయి. అందంగా ఉంటాడు. బుద్ధిమంతుడని విన్నాను. అంతే నేను కోరినది. ఆస్తి నేనెన్నడూ ఆశించలేదు. వివాహం సక్రమంగా జరిగిపోయింది. మరునాటినుంచీ ప్రకాశాన్ని మా యింట్లోనే ఉంచేసుకున్నాను.

పద్మకు పదోఏటినుంచి స్త్రీ పరిచయం తక్కువకావడంవల్లనూ, ఎప్పుడూ నేను ఆమెను ప్రతీ చోటికీ తీసుకువెళ్లుతూ ఉండడంవల్లనూ, అదృష్టం బాగుండి సిగ్గు అలవాటుకాలేదు. పద్మా ప్రకాశం కులాసాగా ఆడుకుంటూ ఉండేవారు.

పద్మకు ఏమీ పని ఉండేదికాదు. ఎప్పుడూ మాతోనే ఆడ్డమో, పాడ్డమో, చదవడమో. ఇరుగు పొరుగువాళ్లతో మాకు ప్రమేయం ఉండేదికాదు. ఎప్పుడైనా ఇటు పక్కనఉన్న మంగమ్మగారు వచ్చి, మా పద్మకు జడవేసిపోయేది. 'పాపం, ఆవిడ ఉంటే ఎంతో బాగుండేది' అని నాకూ, నా పద్మకూ స్వర్గంలో మాకోసం ఎదురుచూస్తున్నవాళ్ల అమ్మమాట తలపుకితెచ్చి కంట తడిపెట్టించేది.

# చిత్రవధ

అయినా మా యింటిసంగతి ప్రపంచానికి తెలిసిపోకుండా ఉండిపోలేదు. మా పనిచేసే పైడమ్మ ద్వారా పద్మకు ప్రకాశంవద్ద ఉండే స్వేచ్ఛ పైకిపాకింది. ఎప్పుడైనా మేము షికారుపోతూంటే మేము వీధి మళ్లేదాకా మావేపుచూసే కళ్లను, చిన్నతనంచేత ప్రకాశం పద్మా గమనించకపోయినా, నేను చూస్తూఉండే వాణ్ణి. అప్పుడప్పుడు వాళ్ల వెక్కిరింపులుకూడా నాకు కనిపించినయి. 'ఇంక కార్యం అక్కరలేదని' 'పద్మ ప్రకాశాన్ని పెళ్లాడలేదు-ఉంచుకుంద'నీను. నేను వాటినెంతమాత్రం లక్ష్యపెట్టలేదు. వాళ్లిద్దరికీ ఆ మాటలు వినబడకుండా నా శాయశక్తులా ప్రయత్నంచేశా కూడా.

ఇంతచేసినా, నా దురదృష్టం నన్ను మొహమ్మీద తన్నింది. ఆ మరుచటిసంవత్సరం ప్రకాశానికి అమ్మవారు పోసింది. రాత్రింపవళ్లు నేను పద్మా పడ్డ అవస్థలు వ్యర్థం అయినై. మమ్మల్ని మరో ఆప్త బంధువు మరణానికి విచారించమని విధి లిఖించింది. ఈ జన్మకింక దుఃఖంలేదనుకున్న నాకు మరోదుఃఖం వచ్చింది. రెండుసార్లూ 'ఈ దుఃఖం భరించడం ఎల్లా?' అనుకున్నాను. రెండుసార్లూ దుఃఖాన్ని అతిక్రమించి హృదయాన్ని రాయిచేసుకుని బతకగలిగాను.

పద్మని ఓదార్చడం ఒక ప్రత్యేకఘట్టమైంది. నేనొక్కణ్ణే ఆ పని చెయ్యలేకపోయాను. మంగమ్మగారు ఆనాడల్లా కూర్చుని 'మానవజీవితం అశాశ్వతమైనదనీ, మహానుభావులుకూడా మృత్యుముఖంలోంచి తప్పించుకోలేరనీ, పుట్టడం చావడంకోసమేననీ' బోధిస్తూనేఉంది. పద్మ ఆనాడల్లా భోజనం చెయ్యనేలేదు.

* * *

నేను నా విధి నిర్వర్తించుకునే ధోరణిలో పడ్డాను. నేను చనిపోయేలోపల పద్మకు శాశ్వతమైన జీవితపథం కల్పించడం నా విధి. ఒకమాటు నేనాప్రయత్నంలో విఫలుడనయ్యాను. ప్రకాశం మరణం ఎంత విధివిహితమైనా, దానికి నేనే కారణం అని కొట్లాడేవాణ్ణి మనస్సుతో. నేను మళ్లీ అల్లుళ్ళకోసం వీధిన పడ్డాను. నేను రెండోపెళ్లి చెయ్యబోతున్నాననే వార్త, రెండురోజుల్లో ఊరంతా పాకిపోయింది. వెంకయ్యగారు దారిలో ఎదురుపడ్డారు. 'ఏమయ్యా నీ అల్లుడు పోయాట్ట! పోడూ! హుఁ. మరీ అంత విచ్చలవిడా! నేననుకుంటూనే ఉన్నాను అలా తిరుగుతే ఆయుక్షీణమని. ఎక్కడోయ్! ఈకాలపువాళ్లు సంస్కర్తలు! పూర్వకాలపువాళ్ళకంటే తము మహాఁ తెలివైనవాళ్ళమనే - ఇహిహీ - చావక బతుకుతాడూ?' అన్నాడు. ఈయనకారం జల్లడానికి పుండుచేసుకున్న నా హృదయమే దొరికిందీ? నేను కోపం పట్టలేక శాంతుణ్ణైపోయాను.

ఇంచుమించుగా, నన్నెరిగిన ప్రతీ మానవుడూ నన్నుచూసి నవ్వేడు. ప్రతీ అడుక్కీ నావెనుక కిలకిలలు వినిపించినయి. నన్ను వెంట తరిమినయి. వాటిని వదిలించుకోడానికి నేను వడివడిగా నడచాను. ఇంటి గుమ్మంలో కాలుపెట్టాను.

ఎన్నడూ లేంది, ఆనాడు గది గుమ్మంలో చాలామంది ఆడవాళ్లున్నారు. అప్పుడే పద్మ లోపలికి పోయి రపీమని తలుపువేసుకొన్నది. నాకు ఆశ్చర్యంవేసింది. అలా నిలబడ్డాను సంగతేమిటోనని....

సుబ్బమ్మగారు అంటున్నది 'ఏదోనమ్మా మాకు తోచిన సలహా మేమివ్వబోయినాం చిన్నపిల్లవు నీకేం తెలుస్తుందని.'

వెంకాయమ్మగారు 'అయినా అంతకోపం అయితే!' అంది ముక్కున వేలువేసుకుంటూ.

నేనప్పుడే గ్రహించాను. వీళ్లేదో తీవ్రంగానే అని ఉంటారని, వాళ్ళంతా నన్నుచూసి ఒకరివెనుక ఒకరు వెళ్లిపోయారు.

'నేను పిల్చాను 'పద్మా' అని. 'వాళ్లు వెళ్లారా?' అంది నీరసంగా. 'ఆ, తలుపు తియ్యమ్మా' అన్నాను. 'కిటికీదగ్గరకు - రండి' అని ఎంతో ప్రయత్నంమీద అంది. గబగబా పరుగెత్తేను, మంచంమీద పడుకుని ఉంది పద్మ. నన్నుచూసి 'నాన్నా, తలుపుతియ్యడానికి లేవలేక రమ్మన్నాను. వీళ్ళమాటలు పడలేక...నీకు వచ్చే అవమానం...' తీవ్రమైన బాధతో ఉండచుట్టుకుపోయింది పద్మ. నాకు గాభరా ఎత్తింది. 'అప్పుడు డాక్టర్ని పిల్చుకురానా' అని కేకవేశాను.

పద్మ బాధనుంచి తెప్పరిల్లి 'క్షమించు...తరువాత నీకు ఎంత కష్టమో...తెలుసు కాని... క్షమించు నాన్నా...ఆ గూట్లోఉన్న విషం తాగే...' ప్రపంచం అంతా తిరిగిపోయింది. భూమి ఆకాశం కలిసిపోయినయి. పెద్ద ఆకాశంలో నేను తేలిపోతూ ఉన్నాను.

తరువాత పద్మ ఎంతసేపు మాట్లాడిందో!

డాక్టరు వచ్చాడో లేదో!..."

'నేను నిర్ఘాంతపోయి చూస్తున్నానతనివైపు. అతను వంచిన తలఎత్తి ఆ నీళ్ళతో నిండిన కళ్ళతో నిశ్చలంగా ఉన్న నా కళ్ళలోకి చూశాడు, అదే అతనికి తృప్తి.—'

## రాధ పిలుపు

శ్రీ గోనెల నరసింగరావు ఎం.ఏ. బి.యల్.

మురళీ మోహన! ఏదీ, ఏయడ నీ జాడ? ఎందుఁ జూచిన నుందువందురే, కనుల విందొనర్పవూ? సందేహమెందుకు? కృష్ణా! కరుణాప్రపూర్ణా!! కనిపించవేమి? కనికరించవేమి? చూడు—

"ప్రకృతియు నిన్నుఁబోలె జలపాదితనమ్ము వహించి యెంతయో
వికలతగూర్చు చున్నయది; ప్రేమ మయాత్ముఁడవైన నీవె, న
న్నకట యుపేక్ష సేయఁగ ననాదరణమ్ము ఘటిల్లదొక్కొ, రా
ధికనిటు గుందుమంచును విధించె, విరించి, యిఁకెట్ట లోకదా."

ఇంకా,

"పున్నమరేయి నొక్కతెనుబోయి వనమ్మున నీదు ముద్దుమో
మెన్నఁడుఁ జూడఁ గల్గుదునొ యేనని గ్రుమ్మరునయ్యెడన్ జగా
వెన్నెలతేఁట నీటులను బిన్నని నీనగవంచునెంచి, కా
కున్న తెఅంగెఱింగి కడునొంచితి విన్నదనమ్ము నెమ్మదిన్!"

పోనీలే, దయలేదుకదూ! నీరాధ ప్రేమ అగాధ, తీయని బాధ ననుభవించుచున్నది. మాధవా! నీ మృదు మధుర నామము నా హృదయమును గదలించి వేయుచున్నది. నీ పేదదాసి యెడల నీయుదాసీన మేల? జాలనై నీపాలఁబడితినని యాలసించెదవా? ఆలోచించెదవా? ఔను. నీయెదలోని ప్రేమ యింకిపోయినది. నీ పెదవులు సుధాధరమును గ్రోల జంకిపోయినవి. నీ చేతలు పెంకెతనము నుంకించుచున్నవి. ప్రభూ ప్రేమావతారా, మొగమింత సూపరాదా? ఇసుమంత దయ చిల్కరాదా? ఏమనుచున్నావు? నా గుండెలో పండిపోయినావా? కనులలో నిండిపోయినావా? నోటిలో నుండిపోయినావా? సరే.